విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 25, మార్చి 2023

అప్పర్ భద్ర డ్యామ్ నిర్మాణం ఆపాలి

సీపీఐ తాలూకా కార్యదర్శి ఎం. నాగార్జున

విశాలాంధ్ర-రాయదుర్గం: తుంగభద్రా డాం పై నిర్మిస్తున్న అప్పర్ భద్ర డ్యామును నిర్మాణ పనులను వెంటనే ఆపాలని తాలూకా కార్యదర్శి ఎం. నాగార్జున అన్నారు. పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హెచ్.ఎల్.సి ఆధునీకరణ పనులు వెంటనే చేపట్టాలి, తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ నుండి ఆధునీకరణ పనుల లోపం వల్ల చివరి ఆయకట్టు వరకు నీరు అందే పరిస్థితిలో లేదని తెలిపారు. తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువకు 32.80 టీఎంసీల నీరు కేటాయింపులు ఉన్నాయి. దీనికి అదనంగా కేసి కెనాల్ డైవర్షన్ ద్వారా మరో 10 టిఎంసి నీరు జిల్లాకు రావాల్సి ఉంది. కానీ ప్రస్తుతం ఆ విధంగా అమలు పరచడం లేదు. కారణం తుంగభద్ర డ్యాం పూడిక కారణంగా డ్యామ్ నిలువ సామర్థ్యం 130టీఎంసీల నుండి 100 టీఎంసీలకు పడిపోయిందని తెలియజేశారు. అందువల్ల తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు దామాషా పద్ధతిలో కేటాయింపులు తగ్గిపోయాయి. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ పనులు ఆగిపోవడం వల్ల ఈ పరిస్థితి నెలకొంది అని తెలియజేశారు. దీనివల్ల సాగు విస్తీర్ణం కూడా తగ్గుతుంది. తుంగభద్ర ఎగువ కాలువమొత్తం 1,00,060 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈసారి 85,398 ఎకరాలు మాత్రం సాగయింది. ఇందులో తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ కనేకల్, బొమ్మనహల్ మండలాల పరిధిలో 15,660 ఎకరాలు మాత్రమే సాగు చేశారు. మొత్తం హెచ్ ఎల్ సి ఆధునీకరణల పనులు చేపట్టకపోవడం వల్ల వర్షాల నుండి నీరు పెరిగినప్పటికీ సాగు తగ్గిపోవడం జరిగిందన్నారు. ప్రభుత్వం స్పందించి ఆధునీకరణ పనులు వెంటనే చేపట్టి ఇటువంటి పరిస్థితుల్లో తుంగభద్ర డ్యాం పై అప్పర్ బద్ర డ్యామ్ నిర్మాణం చేపడితే జిల్లాకు సాగు తాగునీరు కూడా దొరకని పరిస్థితి నెలకొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిర్మాణాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించి ఆంధ్రప్రదేశ్లో రాయలసీమ జిల్లాలు కర్నూల్, కడప, చిత్తూర్ తోపాటు ప్రధానంగా అనంతపురం జిల్లా ప్రజలకు అపర భద్ర డ్యామ్ నిర్మాణం చేపట్టి పూర్తయితే ఇక్కడ ఉన్నటువంటి ప్రజలు పూర్తిగా త్రాగునీరుకు, సాగునీరు లేక గ్రామాలు వదిలి కర్ణాటక తెలంగాణ ప్రాంతాలకు వలస వెళ్లవలసిన పరిస్థితి వస్తుందని తెలియజేశారు. ఈ విషయం పై ప్రతి ఒక్కరు పార్టీ లకు అతీతంగా నిలుపుదలకు భగస్వామ్యం కావాలి వెంటనే బద్ర డ్యామ్ నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కోట్రెష్, పట్టణ ఇంచార్జ్ నర్సింహులు, గుమ్మగట్ట మండల కార్యదర్శి తిపేస్వామి, నాయకులు నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోండి

విశాలాంధ్ర-కూడేరు: ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు సాగుచేసిన పండ్లతోటలు గాలివానకు పూర్తిగా దెబ్బతిని కిందికి పడిపోయాయని, ఆ రైతులను ఆదుకోవాలని శుక్రవారం సిపిఐ బృందం నాయకులు డిమాండ్ చేశారు. మరుట్ల ఒకటో కాలనీకి చెందిన శ్రీరాములు పండ్లతోటల నష్టాన్ని సిపిఐ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా సిపిఐ తాలూకా కార్యదర్శి మల్లికార్జున మాట్లాడుతూ రైతు శ్రీరాములు తనకున్న రెండు ఎకరాల పొలంలో 160 మామిడి చెట్లు సాగు చేశారన్నారు. చేతికొచ్చిన పంట పూర్తిగా రాలిపోవడంతో దాదాపు రెండు లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని రైతులను ఆదుకోవాలని సిపిఐ బృందం డిమాండ్ చేసింది. లక్షల రూపాయలు సాగు చేసి పంటలు సాగు చేస్తే కనీసం పెట్టుబడులు కూడా రాకుండా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం అన్ని రకాల రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ సిపిఐ మండల కార్యదర్శి మల్లికార్జున, వజ్రకరూరు సిపిఐ మండల కార్యదర్శి సుల్తాన్, సహాయ కార్యదర్శి హనుమంతు, రామాంజనేయులు, కూడేరు మండల సహాయ కార్యదర్శి నబి, వెంకటేష్, సీనియర్ నాయకులు రమణప్ప, కమ్మూరు శాఖ కార్యదర్శి కాసిం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

విశాలాంధ్ర-రాప్తాడు: ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల మేరకు ఉదయం 10 గంటల సమయంలో అనంతపురం వైపు నుండి ఒక ద్విచక్ర వాహనంలో డీఆర్డీఏ స్కిల్ డెవలప్మెంట్ విభాగంలో పని చేసే దినేష్, రోజా ఇద్దరూ వెళుతున్నారు. వంగల్ రోడ్ వైపు నుండి ఏపి02టిఈ 2790 టిప్పర్ ను దాని డ్రైవర్ అనంతపురం వైపు రావ్5 వై జంక్షన్ వద్ద మలుపు తిప్పుతూ బైక్ ను ఢీకొట్టగా వారికి తీవ్ర గాయలయ్యాయి. స్థానికులు వెంటనే గాయాలతో ఉన్న ఇద్దరినీ 108 అంబులెన్సు లో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రగాయాలైన చిలమత్తూరుకు చెందిన కిష్టప్ప కూతురు రోజా (25) చికిత్స పొందుతూ మరణించినది. ఇక గుంతకల్లు మండలం నాగముద్రం గ్రామానికి చెందిన గురుస్వామి కుమారుడు ఈడిగ దినేష్ ను మెరుగైన చికిత్స కోసం బెంగళూరు కు తరలించారన్నారు.

ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఆర్థికసాయం

విశాలాంధ్ర-ఉరవకొండ: పవిత్ర రంజాన్ మాసంలో ఉరవకొండ పట్టణంలో ఉన్న ఐదు మసీదులను పరిశుభ్రంగా ఉంచేందుకు ఒక్కో మసీదుకు 15 వేలు రూపాయలు చొప్పున ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఆర్థిక సహాయం చేసినట్లు ఉరవకొండ తెలుగుదేశం పార్టీ ముస్లిం మైనార్టీ విభాగం నాయకులు తెలిపారు. శుక్రవారం ఉరవకొండలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే కేశవ్ ముస్లిం సోదరులకు రంజాన్ మాసం యొక్క శుభాకాంక్షలు తెలియజేస్తూనే ముస్లిముల పట్ల ఆయనకున్న ప్రేమ అభిమానులను చాటుకుంటూ వారి యొక్క ఆయురారోగ్యాలు బాగా ఉండాలని కోరుకుంటూ ఈ సహాయాన్ని అందించినట్లు వారు తెలిపారు.

క్షయ వ్యాధిని నివారిద్దాం

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా డాక్టర్ గీత భార్గవి ఆధ్వర్యంలో శుక్రవారం గొనేహాల్ గ్రామంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ ద్వార ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. డాక్టర్ గీత భార్గవి మాట్లాడుతూ మైకొ బాక్టీరియమ్ టూ బెర్కులోసి స్ అనే సూక్ష్మ జీవి క్షయ వ్యాధి గ్రస్తుడు దగ్గినప్పుడు తుమ్మినప్పుడు గాలి ద్వారా ఒకరి నుండి మరొకరికి వ్యాపిస్తుంది. ప్రధానోపా ధ్యాయులు వేంకటేశ నాయక్,పురుషోత్తం ఎంఎల్హెచ్పి గౌతమి , ఆరోగ్య కార్యకర్త వెంకట రమణ, ఏఎన్ఎం ఈ శ్వరమ్మ , ఆశ శకుంతల పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు

విశాలాంధ్ర-ఉరవకొండ: రాష్ట్రస్థాయి 33వ సెవక్ తక్రా క్రీడా పోటీలలో పాల్గొని రాష్ట్ర ప్రథమ స్థానంలో గెలుపొందిన అనంతపురం మహిళ జట్టును శుక్రవారం ఉరవకొండ పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ గవర్నర్ చంద్ర ప్రకాష్ ఆధ్వర్యంలో అభినందించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ విద్య తో పాటు క్రీడలలో కూడా విద్యార్థులు రాణించాలని పేర్కొన్నారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు సప్తగిరి మల్లికార్జున తో పాటు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మ దేవర

విశాలాంధ్ర-కూడేరు: అరవకూరు గ్రామంలో మారెమ్మ దేవత కు టీడీపీ నాయకులు బంది సంగన్న దేవర నిర్వహించారు. శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రతి నాయకునికి బంది సంగన్న శాలువాలు కప్పి వారిని ఆహ్వానిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు, జిల్లా టీడీపి నాయకులు కొండయ్య, మురళి, మండల ప్రధాన కార్యదర్శి శివయ్య, జిల్లా నాయకులు రోలర్ నాగరాజు, మండల నాయకులు, మాజీ సర్పంచ్ సంగప్ప, జీలన్, మలోబులు, బొమ్మయ్య, చంద్ర, చంద్రబాబు నాయుడు, నిరంజన్, అరవకూరు టీడీపి నాయకులు మాజీ సర్పంచ్ ప్రసాద్, వుట్టా నరేష్, గ్రామ అధ్యక్షులు శ్రీరాములు, అంజి, చేపల ప్రసాద్, అశోక్, చెన్నయ్య, సూరి, ఓజరి, నారాయణ, సంగప్ప, బాష్, ఈశ్వరయ్య, మంజు, కిష్టప్ప, చంటి, విశ్వనాథ, గిరి, సుబ్బరాయడు, శంకరయ్య, వినోద్, మూర్తి, చాకలి మాలరాయుడు, ఏరికల వెంకటేష్, సూరి, విష్ణు వీరితోపాటు పలువురు పాల్గొన్నారు

సిఫారసు చేయడం హర్షనీయం

విశాలాంధ్ర-ఉరవకొండ: ఆంధ్రప్రదేశ్లో బోయలను మరియు వాల్మీకులను ఎస్టి జాబితాలో చేర్చడానికి శామ్యూల్ ఆనంద్ ఏక సభ్య కమిషన్ ఆధారంగా రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి సిఫారసు చేయడం పట్ల బోయలు మరియు వాల్మీకి కులస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉరవకొండలో వాల్మీకి సంఘం నాయకులు ముండాస్ ఓబులేసు, హావలిగి ఓబులేసు, ముష్టూరు చంద్ర, మల్లికార్జున, సురేష్ మాట్లాడుతూ బోయలను వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని తాము అనేక పోరాటాలను కూడా నిర్వహించడం జరిగిందని ఎస్టీ జాబితాలో చేర్చడం న్యాయమైందని దీన్ని కేంద్ర ప్రభుత్వం, పార్లమెంట్ కూడా ఆమోదించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసి సిఫారసు చేయడం పట్ల వారు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

సీపీఐ సీనియర్ నేత కామ్రేడ్ వికె వెంకటరామిరెడ్డి ఆకస్మిక మృతి

విశాలాంధ్ర-యాడికి: సిపిఐ సీనియర్ నేత వేములపాడు మాజీ సర్పంచ్, సింగిల్ విండో అధ్యక్షులు కామ్రేడ్ వికె వెంకటరామిరెడ్డి శుక్రవారం ఉదయం ఆకస్మికంగా కన్నుమూశారు . భారత కమ్యూనిస్టు పార్టీ విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు ఉద్యమంపై ఆకర్షితుడై అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ లో క్రియాశీలకంగా పనిచేశారు. యాడికి మండలం వేములపాడు గ్రామపంచాయతీ సర్పంచ్ గా, సింగిల్ విండో అధ్యక్షులు గా బాధ్యతలు నిర్వహించారు కమ్యూనిస్టు ఉద్యమం నిర్మాణంలోనూ భూస్వామ్య పెత్తందారులకు అప్రజా స్వామిక పాలకులకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమాల్లో ముందు వరుసలో నిలిచారు. అమర జీవి కామ్రేడ్ వీకే ఆదినారాయణ రెడ్డి గారి స్ఫూర్తితో ఆ కుటుంబం మొత్తం కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో భాగమయ్యింది వేములపాడు స్వగ్రామంలో ఆయన భౌతికకాయాన్ని సందర్శించిన తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి , పెద్దవడుగూరు సిపిఐ సీనియర్ నాయకులు సూర్యనారాయణ రెడ్డి, మండల కార్యదర్శులు వెంకటేష్, వెంకటరాముడు యాదవ్ నాయకులు బాలన్న సుబ్బయ్య సుబ్బారెడ్డి సూర్యనారాయణ జూటూరు మహమ్మద్ రఫీ జూటూరు ఇస్మాయిల్ , జూటూరు అబ్దుల్ రజాక్, జూటూరు మహమ్మద్ రబ్బాని జూటూరు మహమ్మద్ రబ్బాని అల్లా బ కాష్ , చౌదయ్య చింతా వెంకటయ్య, శ్రీరాములు పెద్దవడుగూరు సిపిఐ నాయకులు నారాయణ, లింగన్న, రామయ్య, ముత్యాల రెడ్డి నివాళులు అర్పించారు. స్వగ్రామం వేములపాడు లో శనివారం ఉదయం 10 గంటలకు అంత్యక్రియలు జరగనున్నాయి.

ఉద్యమ నాయకుడు కామ్రేడ్ వెంకట్రామిరెడ్డి

సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు కామ్రేడ్ వెంకట్రామిరెడ్డి ప్రజల పక్షాన చేసిన ఉద్యమాలు ఎందరికో ఆదర్శంగా నిలిచాయని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ అన్నారు.సీనియర్ కమ్యునిస్టు నేత కామ్రేడ్ వెంకట్రామిరెడ్డి దీర్ఘకాలిక అనారోగ్య కారణాలతో శుక్రవారం మృతి చెందారు.ఈ మేరకు ఆయన మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు.ముందుగా ఆయన మృతికి జాఫర్ తన సంతాపం తెలిపారు.కామ్రేడ్ వెంకట్రామిరెడ్డి పోరాట యోధుడని ఆయన మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు.విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు ఉద్యమం వైపు ఆకర్షితుడై 1983లో తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సిపిఐ అభ్యర్థిగా పోటీ చేశారని గుర్తు చేశారు. నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం కల్పించేందుకు చైతన్య యాత్ర నిర్వహించారన్నారు.1989 నుండి 1994 వరకు జిల్లా వ్యాప్తంగా జరిగిన ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో అప్పటి సిపిఐ నేత కామ్రేడ్ ఆదినారాయణ రెడ్డి నాయకత్వంలో జరిగిన వీరోచిత పోరాటంలో వీకే వెంకట్రామిరెడ్డి అత్యంత కీలక పాత్ర పోషించాడన్నారు.

లింగ వివక్ష చూపే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: జిల్లాస్థాయి గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత కమిటీ సభ్యులు మరియు సంబంధిత అధికారులతో శుక్రవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ నాగలక్ష్మి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ సమాజంలో లింగ వివక్షను చూపే వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలని సూచించారు. బాలల లింగ నిష్పత్తిని గమనిస్తే బాలికల శాతం తక్కువగా ఉందన్నారు. జిల్లాలో ఎక్కడైనా లింగ వివక్ష జరుగుతోందని బాధితురాలు లేదా వారి కుటుంబ సభ్యులు తగు ఆధారాలతో తమ దృష్టికి తీసుకు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. లింగ వివక్షతను వ్యతిరేకిస్తూ ముందుకు వచ్చి ఫిర్యాదు చేసే వారికి గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం అండగా ఉంటుందన్నారు. లింగ నిర్ధారణకు పాల్పడే స్కానింగ్ సెంటర్లు, వైద్యులపై చట్టపరమైన కేసులు నమోదు చేసి కఠిన శిక్షలు అమలు చేయాలన్నారు. మొదటిసారి రూ. 10 వేలు జరిమానా, మూడేళ్ల జైలు శిక్ష, రెండోసారి రూ. 50 వేలు జరిమానా, ఐదేళ్ల జైలు శిక్ష, మూడోసారి చివరిగా రూ. లక్ష జరిమానా, ఐదేళ్ల జైలు శిక్షతోపాటు వైద్య వృత్తి గుర్తింపు శాశ్వతంగా రద్దు చేయనున్నట్లు చెప్పారు. అలాగే గర్భస్రావాలు జరగకుండా సంభందిత వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో అడిషనల్ సుపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ నాగేంద్రుడు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. వీరబ్బాయి ,జిల్లా నోడల్ అధికారి డా.యుగంధర్,జిల్లా ప్రోగ్రాం అధికారులు డా.సుజాత,డా.చెన్న కేశవులు, డ్రగ్ ఇన్స్పెక్టర్ హనుమన్న, , ఆర్ డి టి డైరెక్టర్ సిద్రెప్ప , రెడ్స్ సంస్థ భానుజా, హెడ్స్ డైరెక్టర్ విజకుమార్,డెమో భారతి, డిప్యూటీ డెమో త్యాగరాజు, హెల్త్ ఎడ్యుకేటర్లు సుబ్రహ్మణ్యం, వేణు గోపాల్, కిరణ్ కుమార్, లీగల్ కన్సల్టెంట్ ఆశా రాణీ పాల్గొన్నారు.

అధునాతన ఎక్సరే ప్రారంభం

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: మార్చి 24 ప్రపంచ క్షయ వ్యాధి నివారణా దినోత్సవ సందర్భంగా జిల్లా క్షయవ్యాధి నివారణా కేంద్రము లోని సెంట్రల్ టిబి డివిజన్ నుండి వచ్చిన లిఆధునాతన 500 ఎం ఏ ఎస్ డిజిటల్ ఎక్సరే మెషిన్ నులి జల్లా వైద్యాధికారి డాక్టర్ వీరబ్బాయి దొర ప్రారంభించారు. అలాగే దాతల సహాయముతో ఆధునికరించిన క్షయ వ్యాధి నిర్ధారణా కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి, జిల్లా క్షయ నివారణా అధికారి దాతలైన ప్రముఖ ఊపిరితిత్తుల వైద్య నిపుణుడు డాక్టర్ సుధీంద్ర, ఛైర్మెన్ కొప్పుల మీనాక్షమ్మ ట్రస్ట్ రవికాంత్ రమణ చే ప్రారంభింప జేశారు. ఈ సందర్భంగా దాతలు డాక్టర్ సుధీంద్ర ని రవికాంత్ రమణ ని జిల్లా వైద్యాధికారి మరియు క్షయ నివారణ అధికారి వారి దాతృత్వమును అభినందించి చిరు సత్కారం చేశారు . ఈ కార్యకమములో పి ఒ డి టి డాక్టర్ సుజాత, జిల్లా మలేరియా అధికారి ఓబులు , ఎన్ జి ఒ జిల్లా కార్యదర్శి చంద్ర మోహన్, ఎన్ జి ఒ నగర కార్యదర్శి శ్రీధర్ బాబు , జిల్లా రేవతి, సూరి,అంజి, నారాయణ, వెంకటష్, ఖాదర్, గౌస్, పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణ దినోత్సవ ర్యాలీ

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయము నుండి తెలుగు తల్లి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య అధికారి జిల్లా వైద్యాదికారి కార్యాలయ సిబ్బంది, క్షయ వ్యాధి కార్యాలయ సిబ్బంది ఆశ కార్యకర్తలు, నర్సింగ్ విద్యార్థులు,ఎన్ జి ఒ లు అనంత పాజిటివ్ నెట్వర్క్, విహాన్ వారి చేత టీబీ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ భారతదేశం నుండి 2025 నాటికి క్షయ వ్యాధి అంతం కొరకు అలాగే 2030 నాటికి క్షయ ను ప్రపంచం నుండి అంతం చేయడానికి సిబ్బంది మిగతా అందరూ తగిన కృషి చేయాలని తెలియచేసారు. జిల్లా వైద్య అధికారి కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్ నందు జరిగిన వరల్డ్ టీబీ డే సెలెబ్రేషన్స్ నందు టీబీ ప్రోగ్రాము నకు సహకరిస్తున్న నిక్షయ మిత్రలకు (రవికాంత్ రమణ వారి మిత్రులు దేవేంద్ర రెడ్డి శ్రీనివాస బాబు కి) మరియు క్షేత్ర స్థాయి ఆశ కార్యకర్తలకు క్విజ్ ఎలక్యూషన్ కాంపిటీషన్ లో గెలుపొందిన విద్యార్థులకు జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ ప్రభుత్వ ఆసుపత్రి పల్మనాలజిస్ట్ డాక్టర్ అశోక్ కుమార్ వీరిని సత్కరించి షీల్డ్ మెరిట్ సర్టిఫికెట్స్ ను అందచేశారు. పి ఒ డి టి డాక్టర్ సుజాత , జిల్లా మలేరియా అధికారి ఓబులు,, డాక్టర్ గంగాధర్, ప్రముఖ ఊపిరితిత్తుల వైద్య నిపుణులు డాక్టర్ సుధీంద్ర , డాక్టర్ విశ్వనాథ్ మెడిక్యూర్ హాస్పిటల్, ఆర్ డి టి డైరెక్టర్ శిద్రప్ప,,అనంత పాజిటివ్ నెట్వ ర్క్ వీరాంజినేయులు , రెడ్ క్రాస్ మోహన్ కృష్ణ , నారాయణ, వెంకటష్, ఖాదర్, గౌస్, భవ్య పేషెంట్ ప్రొవైడర్ సపోర్టింగ్ ఏజెన్సీ మేనేజర్ పద్మ, వారి సిబ్బంది కవిత, సురేష్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం పని బోర్డుల ఏర్పాటు చేయాలి

పనిబోర్డుల ఏర్పాటులో రూ.5 లక్షలు అక్రమాల పై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-విడపనకల్లు: మండలంలో ఉపాధి పనుల్లోభారీగా జరిగిన అవినీతి ,అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చెన్నరాయుడు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ 2018-19-2020-21 మండలంలో పని బోర్డుల ఏర్పాట్లు, పని బోర్డుల ఏర్పాటు బిల్లులు రూ. ఐదు లక్షలు వచ్చాయని, ఉపాధి పనులకు సంబంధించిన వివరాలను బండల మీద రాయించారన్నారు. వాటిని ఉపాధి అధికారులు ఉరవకొండ మండలం బూదగవి గ్రామ సమీపంలో జాతీయ రహదారి పక్కన వదిలేశారన్నారు. అయితే ఆ బోర్డులో వివరాలు ఆధారంగానే సామాజిక తనకి కూడా చేయాల్సి ఉంటుందని ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చెన్నరాయుడు తెలిపారు. అయితే ఉపాధి అధికారులు ఏమాత్రం వాటిని పట్టించుకోకుండా జాతీయ రహదారి పక్కన పడేసి వదిలేసి వెళ్లారన్నారు. అయితే వీటన్నిటి కూడా నిధులు మంజూరు అయ్యాయి కానీ ఉపాధి అధికారులు ఒకరి మధ్య ఒకరికి విభేదాలు రావడంతో ఇక్కడ వదిలేసి వెళ్లినట్లు మండలంలో చర్చించుకుంటున్నారన్నారు. కావున వీటిని సంబంధించిన ఉన్నతాధికారులు చొరవ చూపి ఆయా గ్రామాలకు తరలించి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని 15వ వార్డులో భాగమైన ఆయేషా మసీదులో శుక్రవారం సాయంత్రం ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరులకు ఆ వార్డు సభ్యులైన వసికేరి మల్లికార్జున ఇఫ్తార్ విందు ఇచ్చారు ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు ఎంతో భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేస్తున్నారని వారందరికి కూడా భగవంతుడు ఆయురారోగ్యాలు ఇచ్చే విధంగా ఆశీర్వదించాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ నరసింహులు, వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు మరియు మాజీ జెడ్పిటిసి సభ్యులు తిప్పయ్య, ఉరవకొండ పట్టణ అధ్యక్షులు సి ఓబులేసు, ఈడిగ ప్రసాదు, ధనంజయ, లక్ష్మణ్, వాణి విద్యానికేతన్ కరస్పాండెంట్ రఘు రాములు విరితోపాటు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి జన్మదిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర-విడపనకల్లు: అనంతపురం జిల్లా శాసనమండలి సభ్యులు వై. శివరాం రెడ్డి కి శుక్రవారం అభిమానులు, కార్యకర్తలు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు, విడపనకల్లు మాజీ ఎంపీ రమణారెడ్డి, రాము రెడ్డి, పాల్తూరు మాలింగ, డొనేకల్లు రాంబాబు, సురేష్, మాళాపురం కేశన్న, గురుస్వామి, డీలర్ రవి, ఉపసర్పంచ్ పి.సుంకన్న, డీలర్ రామకృష్ణ, శీనా, మాజీ ఎంపీటీసీ ఓబులేసు, షబ్బీర్, ప్రకాష్, తిమ్మరెడ్డి, భూమా విజయ్, మాజీ సర్పంచ్ భూమా వన్నూరస్వామి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శ్రీలేఖ ఓబులేసు తదితరులు తెలిపారు.

రంజాన్ మాసం ప్రారంభం శుభాకాంక్షలు

విశాలాంధ్ర-విడపనకల్లు: మండల ముస్లింలకు ఎంతో పవిత్రమైన రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా విడపనకల్లు ముస్లింలకు ఎంపిపి కరణం పుష్పవతి భీంరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. నెల రోజులపాటు నియమ నిష్టలతో కఠిన ఉపవాస వ్రతం ఆచరించే ఈ పుణ్య పవిత్ర మాసాన్ని ముస్లిం సోదర సోదరీమణులంతా జరుపుకుంటారని, వారికి అల్లా దీవెనలు లభించాలని ఆయన ఆకాంక్షించారు. మహనీయుడైన మహ్మద్ ప్రవక్త ద్వారా దివ్య ఖురాన్ ఆవిర్భవించినది. రంజాన్ మాసంలోనే కావడంతో ముస్లింలు ఈ నెలకు అత్యంత ప్రాముఖ్యతను ఇస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ మాసంలో ఆచరించే ఉపవాసం, దైవ ప్రార్థనాలు క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని, ఆధ్యాత్మికతను పెంపొందిస్తాయని అన్నారు. అంతేకాక మనిషిలోని చెడు భావనల్ని, అధర్మాన్ని, ద్వేషాన్ని రూపుమాపే గొప్ప పండుగ రంజాన్ అని ఎంపిపి కరణం పుష్పవతి భీంరెడ్డి. అన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర లయన్స్ క్లబ్ గవర్నర్ చంద్ర ప్రకాష్ చేతుల మీదుగా మంచినీటి చలివేంద్ర కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా క్లబ్ గవర్నర్ మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజల యొక్క దాహార్తిని తీర్చడానికి ఉరవకొండ లయన్స్ క్లబ్ వారు ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని గవర్నర్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు సప్తగిరి మల్లికార్జున క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సోలార్‌తో కలుపు మొక్కల నివారణ యంత్రం రూపకల్పన

విశాలాంధ్ర- జె ఎన్ టి యు ఏ: మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగము విద్యార్థులు సోలార్ ఆపరేటెడ్ కలుపు నివారణ మెషిన్ ను తయారు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. రైతులకు ఎంతో ఉపయోగపడే ఈ మెషిన్ ను మెకానికల్ ఇంజనీరింగ్ మూడవ సంవత్సరము చదువుతున్న మణికంత, చిన్నారావు లు అతి తక్కువ ఖర్చు తో ఈ మెషిన్ ను సూళూరుపేట కు చెందిన నరేంద్ర అను రైతు కు కావలసిన విధంగా విద్యార్థులు తయారుచేసి ఇచ్చినట్లు ఆయన అన్నారు. ఈ ఆటోమేటెడ్ సోలార్ కలుపు నివారణ మెషిన్ అనేది పూర్తిగా సౌర శక్తితో నడిచేది అని అన్నారు. ఇది కొద్దీ స్థాయిలో మట్టిని కూడా గొర్రు గుంటక కు ఉపయోగ పడుతుందని, ఎక్కువగా టమోటా, ప్రత్తి, మిరప మొదలైన పంటలలో ఉపయోగ పడుతుందని అని అన్నారు. ఇందులో సోలార్ ప్యానెల్ 40 వాటేజ్, 24 వోల్ట్స్ మోటర్ మరియు 7వి బ్యాటరీలను ఉపయోగించి, రెండు చక్రాలతో నడిచే విధంగా దీనిని తయారుచేసినట్లు ఆయన అన్నారు. రైతులకు కావలసిన ఎంటువంటి పరికరనైనా అతి తక్కువ ఖర్చుతో తయారుచేసి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు ఆయన అన్నారు. ఈ సోలార్ ఆపరేటెడ్ కలుపు నివారణ మెషిన్ ను తయారు చేయుటకు విభాగాధిపతి ఆచార్య ముప్పు లక్ష్మణరావు ఆధ్వర్యం లో తయారుచేసినట్లు తెలిపారు. తయారు చేసిన విద్యార్థులను , విభాగాధిపతి ని కళాశాల కరెస్పాండెట్ డాక్టర్. యెన్. విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్, అసోసియేట్ డీన్ఆర్అండ్ డి తులసీరామ్ నాయుడు అభినందించారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 25, మార్చి 2023

ప్రతి కూలీకి పని కల్పించండి

విశాలాంధ్ర-లేపాక్షి: మండల వ్యాప్తంగా ఉన్న అన్ని పంచాయతీలలోని ఉపాధి కూలీలకు ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కేటాయించాలని చేసిన పనులకు వెంటనే బిల్లులు మంజూరయ్యే విధంగా చూడాలని ఏపిడి శివానంద్ నాయక్, ఎంపీడీవో నరసింహనాయుడు ఆ శాఖ అధికారులకు సూచించారు. కొండూరు పంచాయతీలోని లక్కేపల్లి గ్రామ చెరువులో గ్రామ చెరువులో చేపట్టిన అజాదికా అమృత్ సరోవర్ పనులను వారు శుక్రవారం ఉదయం పరిశీలించారు. 2022 జూలై నెలలో అమృత్ సరోవర్ పనులు చేపట్టడడానికి రూ.27 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. అయితే వర్షాలు కురవడంతో నాలుగు వారాలు మాత్రమే పనులు జరిగాయని క్షేత్రస్థాయి సిబ్బంది అధికారులకు వివరించారు. అయితే 2023 ఫిబ్రవరి నుండి ఇప్పటి వరకు జరుగుతున్నాయని వారికి వివరించారు. ఇప్పటి వరకు 10 వేలు క్యూబిక్ మీటర్లకు గాను 3904 క్యూబిక్ మీటర్లు పనులు జిగాయని వారికి తెలియజేస్తారు. రూ.27లక్షలకు గాను రూ.7.10 లక్షల పను నిధులు ఖర్చు అయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జ్యోతి, ఉపాధి ఇంజనీర్ మధుసుధరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ మండల నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-కనగానపల్లి: మండలంలో స్థానిక ఓబులేసుడి గుడి దగ్గర (ఏఐఎస్ఎఫ్) అఖిల భారత విద్యార్థి సమైక్య కనగానపల్లి నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. ఈ కమిటీకి ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు విజయ్ భాస్కర్ అధ్యక్షత వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు మహాదేవ్, కనగానపల్లి మండల కార్యదర్శి బాలరాజు పాల్గొనడం జరిగింది. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు విజయభాస్కరు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు, మేము వస్తే దేశంలో ఉన్న నిరుద్యోగుల అందరికీ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఇప్పుడు అధికారంలోకి వచ్చి దాదాపు 9 సంవత్సరాల అవుతున్న కూడా ఎక్కడ కూడా ఉద్యోగాలు ఇచ్చిన దాఖలా లేవు, మరి అలాగే వైసీపీ ప్రభుత్వం అధికారంలో రాక ముందు మేము వస్తే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2,35,000 ప్రభుత్వ ఉద్యోగాలు జాబ్ క్యాలెండర్ భర్తీ చేస్తామని చెప్పి, ఇప్పటికి అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు అవుతున్న కూడా ఎక్కడ కూడా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిన దాఖలాలు లేవు , అందుకే ఇవాళ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు మీద పోరాడాల్సిన అవసరమెంతైనా ఉందని మాట్లాడడం జరిగింది. అనంతరం ఏఐఎస్ఎఫ్ కనగానపల్లి నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. కనగానపల్లి మండల అధ్యక్షులుగా చైతన్య, మండల ప్రధాన కార్యదర్శిగా నరేంద్ర, మండల ఉపాధ్యక్షులుగా అశోక్, సుధీర్, నాగమోహన్, సహాయ కార్యదర్శులుగా రాజేష్, కృష్ణ, రంజిత్, పట్టణ నాయకులుగా 22 మందిని ఎన్నుకోవడం నూతన కమిటీగా ఎన్నుకోవడం జరిగింది.

వారపుసంతకు బహిరంగ వేలం

విశాలాంధ్ర-ఓబుళదేవరచెరువు: ఓబుళదేవరచెరువు వారపు సంత, లోడింగ్ అన్ లోడింగ్ కు బహిరంగ వేలం పాటను శుక్రవారం స్థానిక సచివాలయంలో సర్పంచు గోవిందు ఆధ్వర్యంలో నిర్వహించారు. వారపు సంత వేలం పాటను మండల కేంద్రానికి చెందిన తుమ్మల హిదాయతుల్లా రూ. 3,93,500 లక్షలకు, లోడింగ్ అన్లోడింగ్ ను మండోజీ ఆరీఫ్ ఖాన్ రూ.1.92,500 లక్షలకు వేలం పాటలో దక్కించుకున్నారు. వేలం పాటలో పాడిన మొత్తాన్ని రెండు రోజుల్లో సంబంధిత గ్రామ పంచాయతీకి చెల్లించాలని అధికారులు తెలిపారు. ఈఓఆర్డి రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శులు రెడ్డి ప్రకాష్, రామలింగారెడ్డి, సచివాల సిబ్బంది ఓం ప్రకాష్ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రం తనిఖీ

విశాలాంధ్ర-తలుపుల: స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలో ఉన్న సచివాలయం 1పరిధిలో 9వ అంగన్వాడి కేంద్రం నందు శుక్రవారం పోషణ వారోత్సవాల్లో భాగంగా పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి శిశు సంక్షేమ శాఖ పర్యవేక్షకులు దీప, ఏఎన్ఎం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ పర్యవేక్షకులు దీప మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు పుణ్యవతి, లక్ష్మీదేవి, వెంకటేశ్వరమ్మ, స్వరూప రాణి, సుజాత వైద్య సిబ్బంది గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

విశాలాంధ్ర - అగళి : స్థానిక ఆదర్శ పాఠశాలలో జరుగుతున్నా ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం తహసీల్దార్ జిలాని తనిఖీ చేశారు. ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ మాథమాటిక్స్ 2 బి లో 19 మంది కిగాను 19 మంది, జూవాలజీ లో 57 మందికి 57 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ సూపరింటెండెంట్ వై చక్రదారి తెలిపారు. డిపార్ట్మెంటల్ ఆఫీసర్ గా సుమన్ లాల్ నాయక్, స్పెషల్ ఆఫీసర్ గా మహేష్ పరీక్షల నిర్వహణ బాధ్యతలు చేపట్టారు.ఇంటర్మీడియట్ అధికారుల ఆదేశాల మేరకు పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ వై చక్రదారి తెలిపారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయమని ట్రాఫిక్ సిఐ వహీద్ భాషా పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద, ఎర్రగుంట వైయస్సార్ సర్కిల్ వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్ర కార్యక్రమాన్ని ట్రాఫిక్ సిఐ వహీద్ భాష ప్రారంభించారు. అనంతరం వహీద్ భాషా మాట్లాడుతూ తెలుగు రాష్ట్ర భారీ వాహన డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ హక్కుల సాధన సమితి ధర్మవరం వారు చేపట్టిన చలివేంద్ర కేంద్రాలు ఎంతోమందికి స్ఫూర్తినిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు హరికృష్ణ ,కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి రమేష్, సభ్యులు శ్రీరాములు, లోకేష్, అశోక్, శివయ్య, హరి, ధనుంజయ, రామంజి, ముస్కిన్ భాష తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిని కలిసిన యువ నాయకులు

విశాలాంధ్ర-నల్లచెరువు రూరల్: వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిదార్థ్ రెడ్డిని శుక్రవారం తాడేపల్లి రాష్ట్రపార్టీ ప్రధాన కార్యాలయంలో మండల యువనాయకులు సానే హరినాథ్ రెడ్డి సర్పంచులు సంఘం మండల అధ్యక్షులు దాసరి శ్రీనాథ్ రెడ్డి, దినేష్ రెడ్డి, యనమల హరినాథ్ రెడ్డిలు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల ధర్మానికి, అధర్మానికి మధ్య జరిగే రాజకీయ యుద్ధం లాంటిదనీ.పార్టీ విజయానికి తీవ్రంగా కృషి చేయాలన్నారు. యువ నాయకులు మాట్లాడుతూ వైఎస్సార్సిపి నీ మరల అధికారంలోకి తీసుకురావడానికి తాము శాయశక్తులూ కృషి చేస్తామన్నారు.

ఆలయంలో హుండీ లెక్కింపు

విశాలాంధ్ర-లేపాక్షి: లేపాక్షిలోని వీరభద్రస్వామి దేవాలయం నందు దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ నరసింహరాజు పర్యవేక్షణలో శుక్రవారం ఉదయం శాశ్వత హుండీ లెక్కించారు. 45 రోజులకు గాను రూ. 107 970 లు ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-పెనుకొండ: నగర పంచాయతీ పరిధిలోని శ్రీ కృష్ణదేవరాయ కాలనీ నుంచి తన సొంత గ్రామమైన పరమేశ్వరపురం గ్రామానికి జాతీయ రహదారి దాటుతుండగా బెంగళూరు వైపు నుంచి అనంతపురం వెళ్లడానికి వేగంగా వచ్చిన కారు ఏపీ 39 సి ఎక్స్ 52 39 అనే కారు ద్విచక్ర వాహనంలో వెళ్తున్న శ్రీనివాసులు(50) ఢీకొనగా అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య, కుమారుడు ఉన్నట్లు సమాచారం. ఈ సంఘటనపై ఏఎస్ఐ దాదా పీర కేసు నమోదు చేసుకుని, శవ పరీక్ష నిమిత్తం శవని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించరు.

ఘనంగా ఉట్లమాను పరుష

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: పట్టణంలోని దుర్గమ్మ తల్లి దేవాలయం వద్ద శుక్రవారం ఉగాది పండుగను పురస్కరించుకొని ఘనంగా ఉత్సవాలు పరుషను ఆలయ కమిటీ తోపాటు ఉట్లమాను కమిటీ వారు నిర్వహించారు. ఈ ఉట్లమాను పరీక్షలు తిలకించడానికి వందల్లో జనం తరలివచ్చారు. కేరింతలతో ఉట్లమాను పరిష అత్యంత వైభవంగా నిర్వహించుకున్నారు. ప్రతి ఏటా దుర్గమ్మ తల్లి దేవాలయం ఆధ్వర్యంలో ఉత్సవాలు పరిషత్ తో పాటు పలు పోటీలు కూడా నిర్వహిస్తారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడంతో పాటు పోలీసులు కూడా తగిన భద్రతను కల్పించారు. ఉత్కంఠ భరితంగా సాగిన ఉట్లమాను పోటీల్లో విజేతగా పట్టణంలోని బోయగేరి వీధికి చెందిన సాకే జనార్ధన్ విజేతగా నిలవడంతో రూ .10,116 లను నగదును దుర్గమ్మ గుడి ఆలయ కమిటీ వారు అందజేశారు. దుర్గమ్మఆలయ కమిటీ ఈవో వెంకటేశులు, ఆలయ చైర్మన్ పర్వతయ్య, ఉట్లమాను పరుస కమిటీ బోయ నర్సింహులు, వడ్డే శ్రీనివాసులతోపాటు ఆలయ సిబ్బంది భక్తాదులు పాల్గొన్నారు.

విజయోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-చెన్నై కొత్తపల్లి: అసెంబ్లీలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ తరఫున నామినేషన్ వేసిన పంచమర్తి అనురాధకు 23 ఓట్లతో ఎమ్మెల్సీని కైవసం చేసుకున్న సందర్భంగా చెన్నేకొత్తపల్లి మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం ముందు తెలుగుదేశం పార్టీ శ్రేణులు బాణాసంచా కాల్చి విజయోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పట్టభద్రుల విషయంలో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను వైసిపి శ్రేణులు మరువకముందే మరొక ఎమ్మెల్సీ నీ తెదేపా కైవసం చేసుకోవడం తమ పార్టీ రాపు అసెంబ్లీ ఎన్నికలలో విజయం తథ్యమని అన్నారు. మండల కన్వీనర్ ముత్యాల రెడ్డి, మాజీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ అమర మాడెం సూర్యనారాయణ రెడ్డి, శివారెడ్డి, చెన్నకేశవులు గౌడ్, బెస్త నాగార్జునలతోపాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుకొండ: పట్టణము నందు శుక్రవారం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. అనంతరం అందరికీ స్వీట్లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. గురువారం జరిగినఎమ్మెల్సీ ఎన్నికలలో విజయం సాధించిన విజయవాడ మాజీ మేయర్, చేనేత ఆడపడుచు, తెలుగుదేశం కుటుంబసభ్యురాలు పంచుమర్తి అనూరాధ కి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ. ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఎన్ని కుతంత్రాలు పన్నినా చివరకు తెలుగుదేశం పార్టీ విజయాన్ని ఎవరు ఆపలేకపోయారని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ను మరియు ఎమ్మెల్యేల, ఎమ్మెల్సీ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించడంతో కార్యకర్తలను నూతన ఉత్సాహము కలుగుతోందని ఆమె తెలిపారు. ఆమెతో పాటుగా సీనియర్ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు సహకరించాలి

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: క్షయ నిర్మూలనకు అందరూ సహకరించాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ పద్మలత పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవానికి వారు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్.. శ్రావణి, ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ పద్మలత, యునాని డాక్టర్ ఖాదర్, టీబీ యూనిట్ సిబ్బంది కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తూ, ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పద్మలత మాట్లాడుతూ క్షయ ఒక అంటూ వ్యాధి అని, తగ్గినప్పుడు, తుమ్మినప్పుడు, క్షయ క్రిములు గాలి ద్వారా వ్యాపిస్తాయని వారు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఖరీదైన క్షయ వ్యాధి మందులను ఉచితంగా ఇవ్వడం జరుగుతోందని, క్షయ రోగులకు 6 నెలల నుండి 18 నెలల పాటు వైద్య చికిత్సలు కూడా ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా క్షయ రోగులకు చికిత్స సమయంలో ప్రతినెలా 500 రూపాయలను వారి బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా క్షయ వ్యాధిగ్రస్తులకు శ్రేయ హాస్పిటల్ డాక్టర్ కుమార్ బాబు, షామీర్ భాష 22 మంది క్షయరోగులను దత్తత తీసుకొని, ఆరు నెలలు పాటు ఉచితంగా పౌష్టిక ఆహారమును అందజేయడం సంతోషదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఇందురేఖ, వీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ శ్రావణి, యునాని డాక్టర్ ఖాదర్, టీబీ యూనిట్ సిబ్బంది క్రిష్టప్ప, రహమత్ బాషా, చంద్రకళ, సావిత్రి, వి వి యూనిట్ సిబ్బంది లక్ష్మి నారాయణ తో పాటు ఆశా వర్కర్లు, ఐసిటిసి సిబ్బంది పాల్గొన్నారు.

కదిరి: డాట్ చికిత్స తీసుకోని క్షయ వ్యాధి విముక్తి పొందాలని డి ఎం హెచ్ ఓ డా.ఐనుద్దిన్, సూపర్డెంట్డా డా ఉస్సేన్ తెలిపారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం వారు మాట్లాడుతూ క్షయ వ్యాదిగ్రస్తులు వైద్యుల సూచనలు పాటిస్తూ పూర్తి స్థాయిలో మందులు వినియోగించాలని కోరారు. 2025నాటికీ క్షయ వ్యాధి పూర్తిగా నిర్మూలించడానికి ప్రతి నెల ఐదు వందలు పౌష్టికారం కోసం అకౌంట్లో ప్రభుత్వం జమ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. మున్వర్ బాష, ఏ ఆర్ టి మెడికల్ ఆఫీసర్హేమంత్ కుమార్, శ్రీనివాసులు, పద్మావతి, శిరీష, పాల్గొన్నారు.

ప్రతి రైతు ఎరువును ఉపయోగించుకోండి

విశాలాంధ్ర-గోరంట్ల: మేజర్ పంచాయతీ లో తడి,పొడి చెత్తలను వేరు చేసి రైతులకు ఉపయోగపడే విదంగా ఎరువును తయారు చేస్తున్న తరుణంలో ప్రతి రైతు కు అవగాహన కల్పించాలని సర్పంచ్ సరోజనాగేనాయక్ పేర్కొన్నారు. పట్టణంలో కాయగూరల మార్కెట్ సమీపంలోని చెత్త సేకరణ కేంద్రం ఆవరణలో ఎంపీడీఓ రఘునాథ్ గుప్తా ఆధ్వర్యంలో శుక్రవారం డిపిఆర్సీ హేమావతి గోరంట్ల మండలంలోని గోరంట్ల, మల్లాపల్లి పంచాయతీ లతో పాటు బుక్కపట్నం మండలంలోని సిద్ధరంపురం,ఎం.అగ్రహారం,కొత్తచెరువు మండలం లోని నాగిరెడ్డి పల్లి,బైరపురం గ్రామ పంచాయతీల సర్పంచ్ లు, కార్యదర్శిలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్ సరోజనాగేనాయక్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి ఇంట్లో ని చెత్తను ట్రాక్టర్ల ద్వారా చెత్త సేకరణ కేంద్రానికి తరలించి తడి చెత్తను,పొడి చెత్తను వేరు చేసి రైతులకు ఉపయోగపడే విధంగా పంచాయతీ కార్మికులు అహర్నిశలు కష్టపడుతున్నారని, అదేవిధంగా మండలంలో రైతులు పశువులు వేసిన పేడ, పశువుల కింద ఏర్పడిన చెత్తను పారవేయకుండా చెత్త సేకరణ కేంద్రానికి పంచాయతీ సిబ్బంది తరలించిన అనంతరం ఆ పేడ ద్వారా తయారు చేసిన ఎరువును విక్రయించి అదే రైతు కు 65% ఇవ్వబడునని పట్టణంలో ని ప్రజలు కూడా చెత్తను ఎక్కడ బడితే అక్కడ పారవేయారదని పంచాయతీ సిబ్బంది ఎక్కడ ఏర్పాటు చేసి ఉంటే అక్కడే వేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి ప్రమిలమూర్తి, జడ్పి కొఅప్సన్ డాక్టర్ బాషా,జడ్పిటిసి పాలే జయరాం నాయక్,పంచాయతీ కార్యదర్శి సతీష్ కుమార్,మల్లాపల్లి సర్పంచ్ శివనంద,కొత్తచెరువు ఎంపీడీఓ సిద్దారెడ్డి, బుక్కపట్నం ఎంపీడీఓ శ్రీనివాసులు,ఈవో ఆర్డీ ఇందిరాబాల, అగ్రహారం సర్పంచ్ నాగేంద్రమ్మ,గోరంట్ల, మల్లాపల్లి కార్యదర్సులు,పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

పరీక్ష కిట్లు పంపిణీ

విశాలాంధ్ర -చెన్నేకొత్తపల్లి : ధర్మవరం పట్టణానికి చెందిన ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్ మరియు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయ చంద్రా రెడ్డి ఆర్థిక సహాయ సహకారాలతో యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సికెపల్లి జడ్పీ హైస్కూల్ లో స్థానిక హెడ్మాస్టర్ సాయి ప్రసాద్ అధ్యక్షతన 10వ తరగతి చదువుతున్న 100 మంది విద్యార్థినీ, విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు , ఆత్మీయ ట్రస్ట్ వైస్ చైర్మన్ శెట్టిపి సూర్యప్రకాష్ రెడ్డి, పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షురాలు అంజలీ, అభివృద్ధి అధికారి అశోక్ నాయక్, మండల విద్యాశాఖ అధికారి కృష్ణమోహన్, జెడ్పిటిసి గోవిందరెడ్డి, ఎంపీటీసీలు చిన్న, పవన్ కుమార్ చేతుల మీదుగా ఎగ్జామ్ పాడ్స్, పెన్నులు, అందజేశారు. ఆత్మీయ ట్రస్ట్ సభ్యులు కేశగాల్ల రంజిత్ కుమార, యుటిఎఫ్ సికెపల్లి మండల నాయకులు నబీ, అమర్నాథ్ రెడ్డి , కృష్ణతేజ, ఎం ఆర్ సి సిబ్బంది శివారెడ్డి, సుబ్బారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా పంచమ జ్యోతుల ఉత్సవం

విశాలాంధ్ర-సోమందేపల్లి: గ్రామ దేవతగా, కొంగు బంగారమై వెలుగొందుతూ, తొగట వీర క్షత్రియుల ఆరాధ్య దైవంగా పూజింపబడుతున్న చౌడేశ్వరి దేవిపంచమ పంచమ జ్యోతుల ఉత్సవం శుక్రవారం వేలాది మంది భక్తుల మధ్య వైభవంగా జరిగింది. తెల్లవారు జామున 3 గంటలకు అమ్మవారి దేవాలయంలో ఉత్సవ విగ్రహానికి ఆలయ ధర్మకర్త డీసీ ఈశ్వరయ్య పూజలు నిర్వహించి ఊరేగింపుగా బయలు దేరివెళ్లారు . ఆంజనేయస్వామి దేవాలయం, పాతూరు, డీఎల్ రోడ్డు, సంత మార్కెట్ రోడ్డు మీదుగా చెరువు వద్దకు జ్యోతులను నెత్తిపై పెట్టుకొని ఆనందం ఆడుకొంటూ యువకులు ముందుకు సాగారు. జ్యోతుల మహొత్సవాన్ని చూడడానికి భక్తులు తెల్లవారుజామున 3 గంటల నుండి భారీగా వీధులలోను, ఇళ్ల మిద్దెలపైన నుండి తిలకించారు. దేవాలయం వద్ద నుండి ఉరిగింపుగా వెళ్లే దారికి ఇరువైపులా విద్యుత్ అలంకరణతో సుందరంగా అలంకరించారు. ఉత్సవాల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఎస్సై విజయ్ కుమార్ గట్టి చర్యలు తీసుకొన్నారు. పూజా కార్యక్రమంలో పెద్దలు డీసీ వెంకటేశులు, జడ్పీటీసీ డీసీ అశోక్ కుమార్, వైస్సార్ సిపి జిల్లా సేవాదల్ అధ్యక్షులు, ఉపసర్పంచ్ వేణు, ఎంపీటీసీ పూజారి ఈశ్వరయ్య, పూజారి శంకర,ఆలయ కమిటీ సభ్యులు, జ్యోతి కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

ఏమి చేసినా భయపడేది లేదు

విశాలాంధ్ర - హిందూపురం : రాహుల్ గాంధీపై జరిగి తప్పుడు కేసు శిక్షకు నిరసనగా, పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్ర రాజు ఆదేశాల మేరకు, సత్యసాయి జిల్లా అధ్యక్షులు సుధాకర్ ఆధ్వర్యంలో హిందూపూర్ నందు, రాహుల్ గాంధీ మీద బీజేపీ నేతలు కుట్ర పన్ని, 2019 లో రాహుల్ గాంధీ, ఎన్నికల ప్రచారంలో తప్పు మాట్లాడినాడని, రాహుల్ గాంధీ రాజకీయ ఎదుగుదల చూసి ఓర్వలేక సూరత్ కోర్టులో, రెండు సంవత్సరాల కారాగార శిక్ష వేశారని, ఇందుకు నిరసనగా శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జిల్లా అధ్యక్షులు సుధాకర్, బాలాజీ మనోహర్, నాగరాజు, అమానుల్లా, యమ్ కే. యునుస్, జమీల్ నిరసన చేశారు. వారు మాట్లాడుతూ, బీజేపీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండ గడుతూ, బీజేపీ నేతలు ఎన్ని కేసులు పెట్టినా, భయపెట్టిన, బెదిరించినా దాడులు చేసినా, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భయపడరని, దేశంలోని కోట్ల మంది కార్యకర్తలు జైల్ భరో చేసి, దేశాన్ని దిగ్బందిస్తామని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునావృతం కాకుండా బీజేపీని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ,రామాంజినేయులు,గంగాధర్, మహబూబ్ బాషా, రఫిక్, సద్రుల్లా, పీరుసాబ్, అమాతుల్లా, గౌస్, అయాజ్, వరదరాజు, మ ల్లి, నర్సింహులు తోపాటు తదితరులు పాల్గొన్నారు.

వాలంటరీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-కొత్తచెరువు: మండలంలో పలు గ్రామపంచాయతీలో ఖాళీగా ఉన్న వాలంటరీ పోస్టులకు అర్హులైన యువతి యువకులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సిద్ధారెడ్డి తెలిపారు. ఈనెల 24వ తేదీ నుండి 27వ తేదీ వరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కేసాపురం ఒకటి తిరుమల దేవరపల్లి ఒకటి, బండ్లపల్లి ఒకటి, కొత్తచెరువు మూడు వాలంటరీ పోస్ట్ లు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటిని అరుహులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థి కుటుంబానికి ఆర్థికసాయం

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: కర్నూల్లో నవీన్ కుమార్ అనే వైద్య విద్యార్థి ప్రథమ సంవత్సరం చదువుతూ పరీక్షల్లో ఫెయిల్ అయినందుకు గాను ధర్మవరం పట్టణంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సందర్భంగా శుక్రవారం రిటైర్డ్ జిల్లా అంతత్వ నివారణ అధికారి, కర్నూల్ వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు డాక్టర్ నరసింహులు తారకరామాపురంలోని వారి ఇంటికి వెళ్లి ఆ కుటుంబాన్ని పరామర్శిస్తూ, సంతాపం తెలుపుతూ, తనవంతుగా 10,000 రూపాయలను ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ సీఎం కావడమే లక్ష్యం

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: రాబోయే ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి కావాలని, చిలకం మధుసూదన్ రెడ్డి ధర్మవరం ఎమ్మెల్యేగా గెలుపొందాలని కోరుతూ శుక్రవారం జనసేన పార్టీ నాయకులు కెలవత్ నాయుడు ఆధ్వర్యంలో లక్ష్మీనారాయణ, కడపల సుధాకర్ రెడ్డి, ధారా గంగాధర్, గొంగటి హరి, వెంకటేష్ నాయక్, నారాయణస్వామి నాయక్, మాలేపాటి శ్రీరాము అందరూ కలిసి పట్టణములోని కొత్తపేటలో గల లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయముతోపాటు, పలు దేవాలయాలలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. మత్స్యకార వికాస విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెస్త శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి రామాంజనేయులు, మండలాధ్యక్షులు నాగ సుధాకర్ రెడ్డి ,పురం శెట్టి రవి, చంద్ర బాబు నాయుడు ,జిల్లా సంయుక్త కార్యదర్శి దూది జయ రామాంజనేయులు, బాలకృష్ణ, కార్యనిర్వాహన కమిటీ సభ్యులు పేరూరు శ్రీనివాసులు, కోటికి రామాంజి, బండ్ల చంద్రశేఖర్, రామకృష్ణ నాయక్, తలారి ప్రతాప్ తో పాటు 100 మందికి పైగా వారు సంఘీభావం తెలిపారు.

శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-కొత్తచెరువు: పుట్టపర్తి సమీపాన ఎనుములపల్లి వద్ద భవిత కేంద్రంలో వికలాంగులకు ఉచిత పరికరాల పంపిణీకి శిబిరము నిర్వహించడం జరుగుతుందని ఎంఈఓ వెంకటరమణా నాయక్ తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వం పాఠశాలలో చదివే వికలాంగ విద్యార్థులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరానికి వచ్చే విద్యార్థులు ఆధార్ కార్డు, ఫోటోలు తీసుకొని రావాలన్నారు. అర్హులైన వారిని గుర్తించి వారికి పరికరాలు అందించడం జరుగుతుందన్నారు.

అధికారం మళ్లీ వైసీపీదే

విశాలాంధ్ర-నల్లచెరువు రూరల్: రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్సీపీ మళ్లీ అధికారం రాబోతుందని పంచాయతీ జోనల్ ఇంచార్జీ రమణా రెడ్డి అన్నారు.తాడేపల్లి రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రియతమ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే మనకు శ్రీరామరక్షని తెలిపారు. సచివాలయంలో ఎమ్మెల్యేలు పీవీ సిద్దారెడ్డి, శంకర్ నారాయణ, మధుసూదన్, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎమ్మెల్సీ కల్పలతరెడ్డిలను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎంపిపిల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు హనుమంతురావు ను తన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. వైస్ ఎంపీపీ నారాయణ స్వామి, సర్పంచులు సంఘం అధ్యక్షుడు దాసరి శ్రీనాథ్ రెడ్డి, యువ నాయకులు సానే, యనమల హరినాథ్ రెడ్డి, ఆడిటర్ దినేష్ రెడ్డి పాల్గొన్నారు.

కేంద్రానికి నివేందిచడం హర్షణీయం

విశాలాంధ్ర - అగళి : సీఎం జగన్ బోయ వాల్మీకిలను గతంలో పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఎస్టీ జాబితాలో చేర్చడానికి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదించడం పట్ల బోయ వాల్మీకిలు హర్షం వ్యక్తం చేశారు. వాల్మీకులను ఎస్టి హెూదా కల్పిస్తామని ఇచ్చిన హామీమేరకు మాట నిలబెట్టుకున్నందుకు ముఖ్యమంత్రి కి బోయ వాల్మీకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు గాయత్రి హేమంత్ రాజ్, నియోజకవర్గ సోషల్ మీడియా కో కన్వీనర్ లింగరాజు, సచివాలయ కన్వీనర్ నాగరాజు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, మండల సోషల్ మీడియా కన్వీనర్ నారాయణ, కో కన్వీనర్ రమేష్, మంజునాథ తదితరులు కృతజ్ఞతలు తెలియజేశారు.

సచివాలయం ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-పెనుకొండ: మండల పరిధిలోని గోనిపేట గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన పెనుకొండ సబ్ కలెక్టర్ కె.కార్తీక్. ప్రభుత్వం అందిస్తున్న అన్ని పథకాలు ప్రజలకు చేరేవిధముగా చూడాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించిన సబ్ కలెక్టర్. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాదయాత్ర విజయవంతం చేయండి

విశాలాంధ్ర-రొద్దం: జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, పెనుగొండ మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి ఆర్. మరువపల్లి స్వగృహంలో శుక్రవారం మండల నాయకులతో సమావేశం నిర్వహించి తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగలం పాదయాత్రను విజయవంతం చేద్దామని దిశ నిర్దేశాలు తెలియజేశారు. ఈనెల 27వ తారీఖున లోకేష యువగలం పాదయాత్ర గోరంట్ల పట్టణం వచ్చుచున్న సందర్భంగా ప్రతి గ్రామానికి రెండు వాహనాలు సమకూర్చామని నాయకులు, కార్యకర్తలు ముందుండి పాదయాత్ర సభ విజయం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈ చిన్నప్పయ్య, రామకృష్ణప్ప, నరసింహులు, నరహరి, నారాయణప్ప, మున్నా, మురళి, హరీష్, పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నివాసానికి స్థలాలు ఏర్పాటు

పెనుకొండ: మండల పరిధిలోని, గుట్టూరు గ్రామములో నారా లోకేష్ యువగళం పాదయాత్రకు సంబంధించిన స్థలాన్ని, చదును చేస్తుండగా పరిశీలించిన శ్రీ సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జీ బి కే పార్థసారథి. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుబ్బరాయుడు, నాగప్ప, మండల ఉపాధ్యక్షులు నాగరాజు, మండల బి సి సెల్ అధ్యక్షుడు ఆదిశేషు, సిద్దప్ప, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం తెలుగు రాష్ట్ర భారీ వాహన డ్రైవర్లు, క్లీనర్లు హక్కుల సాధన సమితి, గుడివాడ వారు బి కే పార్థసారథికి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

యువత అత్యున్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

విశాలాంధ్ర-హిందూపురం టౌన్: సమాజంలోని యువత ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని ఉత్తమ పౌరులుగా మెలగాలని అదనపు జిల్లా జడ్జి శైలజ సూచించారు. శుక్రవారం పట్టణంలోని బాలికల వసతి గృహంలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. జీవితంలో అనేక మలుపులు ఎదురవుతుంటాయని సహనంతో వాటిని ఎదుర్కోవాలన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు ఎన్నో ఆశయాలతో తమ పిల్లలను చదువుల కోసం ఇతర ప్రాంతాలకు పంపిస్తుంటారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా మెలగాల్సిన బాధ్యత విద్యార్థులదే అన్నారు. విద్యార్థి దశ ఎంతో కీలకమని, విద్యార్థి దశలోనే ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని కృషి పట్టుదలతో విజయాలను సాధించాలన్నారు. జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకున్న తర్వాత సమాజాభివృద్ధి కోసం సహకరించాలన్నారు. మంచి స్నేహితులు,మంచి వాతావరణం మంచి బుద్ధితో వ్యవహరిస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఆమె తెలిపారు. ముఖ్యంగా మహిళల కోసం అనేక చట్టాలు చేయడం జరిగిందని వాటిపై అవగాహన పెంచుకొని ఇతరులకు కూడా చైతన్యం తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పార్వతి, నవేరా, వార్డెన్ భారతి, లోక అదాలత్ శారద పాల్గొన్నారు.